సాక్షి
చిత్తూరు
గురువారం । 22 । ఆగస్టు । 2024



సేంద్రియ వ్యవసాయంపై అధ్యయనం

సేంద్రియ వ్యవసాయం పై అధ్యయనం చేయడానికి ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ శాస్త్రవేత్తల బృందం వచ్చింది. - 8లో



సర్దుబాట్లు మాకొద్దు సారూ..!

జిల్లాలో బలవంతంగా నిర్వహిస్తున్న 'సర్దుబాటు' తమకొద్దని టీచర్లు తేల్చి చెబుతున్నారు. - 8లో



శిలాఫలకంపై సమ్మెట పోటు!

నగరిలో టీడీపీ నేతలు రెచ్చిపోయారు. శిలాఫలకాన్ని సమ్మెటతో పగలగొట్టి తమ అక్కసు ప్రదర్శించారు. - 8లో

న్యూస్‌రీల్

27 నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు

– డీఈఓ దేవరాజు



డీఈఓ దేవరాజు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఈ నెల 27వ తేదీ నుంచి సెప్టెంబర్ 4 వరకు సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ దేవరాజు వెల్లడించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒకటి నుంచి పదవ తరగతి విద్యార్థులకు గతంలో నిర్వహించే ఫార్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్ష పేరును ప్రభుత్వం సెల్ఫ్ అసెస్‌మెంట్-1గా మార్పు చేసినట్లు చెప్పారు. ఈ పరీక్ష అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఒకటి నుంచి 8వ తరగతి వరకు సీబీఏ-1 పరీక్షలు ఓఎంఆర్ పద్ధతిలో నిర్వహిస్తామన్నారు. ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఉదయం 10.45 నుంచి 11.45 గంటల వరకు, 6 నుంచి 8 వ తరగతి వారికి మధ్యాహ్నం 1.10 నుంచి 2.20 గంటల వరకు, 9,10 తరగతులకు ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని ఎంఈఓలు, డీవైఈఓలు పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

నేడు బదిలీల నివేదిక ఇవ్వండి

– జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ పరిధిలో పనిచేసే ఉద్యోగులు బదిలీలకు సంబంధించిన నివేదిక గురువారం ఇవ్వాలని జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు. జీఓ నంబర్ 75 ప్రకారం బదిలీల ప్రక్రియ మొదలవుతుందని, ఐదేళ్లు ఒకేచోట పని చేసిన ఉద్యోగులు బదిలీకి అర్హులన్నారు. వారు పని చేయడానికి కోరుకునే ప్రాంతాలను ఆప్షన్‌లో సూచించాలన్నారు. అలాగే మెడికల్ లేదా భార్య లేదా భర్త ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న వారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో వినతిపత్రం ఇవ్వాలన్నారు. నివేదికను జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి సబ్ రిజిస్ట్రార్లు పంపాలన్నారు. ఇదలా ఉంచితే, జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద రాత్రి పెట్రోలింగ్ సమయంలో పోలీసులు నిఘా పెట్టాలని జిల్లా ఎస్పీని కోరినట్లు తెలిపారు.

విద్యుత్ గ్రీవెన్స్‌కు 26 ఫిర్యాదులు



వినతులు స్వీకరిస్తున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు, తిరుపతి జిల్లాలలో బుధవారం నిర్వహించిన విద్యుత్ గ్రీవెన్స్‌కు 26 ఫిర్యాదులు అందాయి. వీటిలో 17 సమస్యలను పరిష్కరించినట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు.

ఇటీవల తిరుపతి జిల్లాలోని కొన్ని ప్రభుత్వ హాస్టళ్లలో అతిసారం విజృంభించింది. పలువురు విద్యార్థులు ఆస్పత్రుల పాలయ్యారు. ఇప్పుడు చిత్తూరు జిల్లాలో పేరొందిన అపోలో మెడికల్ కాలేజీలో సైతం అతిసారం విద్యార్థులను ఓ కుదుపు కుదిపింది. ఒకరూ కాదు.. ఇద్దరూ కాదు ఏకంగా 300 వరకూ విద్యార్థులు అతిసారం బారిన పడి విలవిలలాడారు. అదీనూ అందరూ వివిధ కోర్సులు అభ్యసిస్తున్న వైద్య విద్యార్థులే కావడం గమనార్హం. కొందరికి అపోలోనే చికిత్స చేస్తుండగా, మరికొందరిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.



జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

అతిసారం..హాహాకారం



బాధితురాలిని ఆస్పత్రికి తీసుకొచ్చిన దృశ్యం



కాణిపాకం: తినే తిండిలో నాణ్యత లోపించింది. ఆ లోపం విద్యార్థులకు శాపంగా మారింది. కలుషిత ఆహారం విద్యార్థులను అతిసారంతో అతలాకుతలం చేసింది. దాదాపు 300మంది విద్యార్థులను వాంతులు, విరేచనాలకు గురి చేసింది.బాధిత విద్యార్థులను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రి తరలిస్తున్నారు. మరి కొంత మందిని అపోలో కాలేజీలో చికిత్స చేస్తున్నారు. కేసుల సంఖ్య మరింత పెరుగుతోంది. జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారులు అపోలోలో వైద్య శిబిరం ఏర్పాటుకు పూనుకున్నారు. ఈ ఫుడ్ పాయిజన్‌కు ప్రధాన కారణం ఆహార నాణ్యత లోపమంటూ అధికార వర్గాలు, అపోలో విద్యార్థులు చెప్పారు. చిత్తూరు నగరానికి దాదాపు 4 కిలోమీటర్ల దూరంలోని మురకంబట్టు ప్రాంతంలో అపోలో మెడికల్ కాలేజీ ఉంది. ఈ కాలేజీలో ఎంబీబీఎస్, ఏహెచ్ఎస్, బీఎస్సీ, ఎంఎస్సీ, ఫిజియోథెరపీ, బీటెక్, ఎంబీఏ కోర్సుల్లో దాదాపు 900 మంది ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందినవారు చదువుతున్నారు. వీరంతా కాలేజీ హాస్టల్లో ఉంటున్నారు. మంగళవారం మధ్యాహ్నం(అన్నం, వంకాయ, సాంబరు) ఆహారం కలుషితమైనట్లు తెలుస్తోంది. ఆ రోజు రాత్రి విద్యార్థుల్లో కొందరికి వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. తర్వాత రాత్రి దోస, సాంబరు తిన్నారు. ఈ భోజనం తిన్న చాలా మందికి బుధవారం వేకువజామున 2 గంటల ప్రాంతంలో వాంతులు, విరేచనాలు ప్రారంభమయ్యాయి. ఆ సమయంలో విద్యార్థులు బాగా ఇబ్బంది పడ్డారు. ఉదయానికి ఇది మరింత తీవ్రమైంది. అప్పటి నుంచి విద్యార్థులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి బాటపట్టారు. విషయాన్ని తల్లిదండ్రులకు చేరవేయడంతో కొంత మంది ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మరి కొంత మందిని అపోలోలోనే ఉంచి చికిత్స చేస్తున్నారు. అయితే ఉదయం అల్పాహారం (మిరపకాయ బజ్జీ, ఉప్మా, ఉగ్గాని) తీసుకున్న మరింత మంది కూడా మధ్యాహ్నానికి డయేరియా బారిన పడ్డారు. వారందరినీ అంబులెన్సులలో చిత్తూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. సాయంత్రం 5 గంటలకు 200మంది బాధితులయ్యారని అధికారులు చెబుతుండగా, విద్యార్థుల మాత్రం 300 మంది డయేరియా బారినపడినట్లు చెప్పారు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందిన డిశ్చార్జి అయిన కొంతసేపటికే మళ్లీ అస్వస్థతతో బాధితులు ఆస్పత్రిలో చేరారు. రాత్రికి బాధితుల సంఖ్య మరింత పెరగవచ్చని విద్యార్థులు, సిబ్బంది, అధికారులు చెప్పారు.

మీడియాను అనుమతించకుండా..

వైద్య విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని సమాచారం అందుకున్న పోలీసులు, పాత్రికేయులు అపోలో ఆస్పత్రి అత్యవసర విభాగానికి వెళ్లడంతో చుక్కెదురైంది. లోపలికి అనుమతించకుండా సెక్యూరిటీ సిబ్బంది తలుపులు వేశారు. దీంతో ఆ ప్రాంతం అంతా గందరగోళంగా మారింది. పోలీసులు...మీడియాకు, సిబ్బందికి మధ్య అర్ధగంట పాటు వాగ్వివాదం చోటుచేసుకుంది. తర్వాత తలుపులు తోసుకుంటూ పాత్రికేయులంతా లోపలికి వెళ్లిపోయారు.



అత్యవసరం విభాగం వద్ద పోలీసులు.. మీడియా, సిబ్బందికి మధ్య వాగ్వివాదం

ఇక అతిసారం ఘటనతో ఓ విద్యార్థి సంఘం అపోలో మెడికల్ కాలేజీలో విధ్వంసం సృష్టించింది. నినాదాలు చేస్తూ..కాలేజీలోని కుర్చీలను ధ్వంసం చేసింది. విధ్వంసాన్ని కొంత మంది విద్యార్థులు, కాలేజీ సిబ్బంది వీడియో తీశారు.

అధికారుల తనిఖీ

అపోలో విద్యార్థులు వాంతులు, విరేచనాలతో అధికసంఖ్యలో ఇబ్బందులకు గురవుతున్నారని తెలుసుకున్న జిల్లా అధికారులు అక్కడికి పరుగులు తీశారు. బాధిత విద్యార్థులను పరామర్శించారు. వాంతులు, విరేచనాలకు కారణాలేమిటో డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డి విద్యార్థులను ఆరా తీశారు. మెరుగైన చికిత్స చేయాలని ఆస్పత్రి అధికారులకు ఆదేశించారు. అలాగే డీఎంఅండ్‌హెచ్ఓ ప్రభావతిదేవి అపోలో కాలేజీని తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో తెలుసుకున్నారు. బాధితులకు వాంతులు, విరేచనాలతో పాటు తీవ్ర జ్వరం, ఒంటినొప్పులు, అధిక చలి, తలనొప్పి వంటి లక్షణాలతో బాధపడుతున్నట్టు గుర్తించారు. కాలేజీతో పాటు హాస్టల్ పారిశుధ్య నిర్వహణ, శుభ్రత ఎలా ఉందో పరిశీలించారు. తాగునీటి నమూనాలు సేకరించారు. అలాగే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు వంటగదిని తనిఖీ చేశారు. అక్కడ వండిన ఆహార పదార్థాలేవీ లేకపోవడంతో బియ్యం, కందిపప్పు, శెనగ గింజలు శ్యాంపిల్స్ మాత్రమే తీసుకుని వాటిని విజయవాడకు పంపారు. మూడు రోజుల్లో ఈ ఫలితాలు రానున్నాయని నాగేంద్రబాబు పేర్కొన్నారు. ఇక గురువారం ఉదయం 9 గంటలకు తిరుపతి నుంచి రాపిడ్ రెస్పాన్స్‌టీం (ఆర్ఆర్‌టీ) రానుంది. ఈ టీం ఆస్పత్రి నిర్వహణను తనిఖీ చేయనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెప్పారు.



అతిసారం బాధితులకు అందిస్తున్న వైద్యసేవలు

భోజనం బాగాలేదని...

క్యాంటీన్‌లో వండి పెడుతున్న భోజనం సరిగా లేదని పలుమార్లు విద్యార్థులు కాలేజీ అధ్యాపకులు, నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లినట్లు పలువురు చెప్పారు. భోజనంలో వచ్చిన పురుగులను కూడా చాలాసార్లు చూపించిననూ భోజన విషయంలో ఎలాంటి మార్పు లేదని సమాచారం.

అపోలో నూతన భవనంలో చికిత్స

అపోలో కాలేజీలోని కొత్త భవనంలో సైతం అతిసారం విద్యార్థులకు వైద్యసేవలు అందిస్తున్నారు. అక్కడి ఉన్న నాలుగు ఫ్లోర్లు ఉండగా, గ్రౌండ్ ఫ్లోర్ మొదలుకుని మూడు ఫ్లోర్లలోని బెడ్లలో విద్యార్థులను అడ్మిట్ చేశారు.



చికిత్స పొందుతున్న అతిసారం బాధిత విద్యార్థులు

అనగనగనగా ఏడు చేపలు.. ఓ చేప ఎండలేదంటే ఎందుకు ఎండలేదనేది పాత కథ. ఇపుడు కథ మారింది. టీడీపీ నేతలు వేసిన వలలో మత్స్యశాఖ కార్యాలయం చిక్కుకుంది. అందులో పట్టుబడ్డ చేపల్ని పక్కకు పడేసి, అవి కొలువున్న స్థలాన్నే రోస్ట్ చేసి ఆరగించడానికి స్కెచ్ వేశారు! చిత్తూరు నడిబొడ్డున ఉన్న జిల్లా మత్స్యశాఖ కార్యాలయాన్ని ఆక్రమించి తెలుగుదేశం పార్టీ కార్యాలయం కట్టాలని రంగంలోకి దిగారు. కనీసం జిల్లా యంత్రాంగానికి ఏమాత్రం సమాచారం ఇవ్వలేదు. ఫలితంగా జిల్లాలోని దాదాపు 700లకు పైగా మత్స్యకార సంఘాల కోసం కేటాయించిన విలువైన స్థలం కనుమరుగవుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది.



కార్యాలయ ఆనవాళ్లు లేకుండా చదును చేస్తున్న జేసీబీలు

చేప స్థలం రోస్ట్!

- 'పచ్చ' వలలో జిల్లా మత్స్యశాఖ విలవిల
- రూ.40 కోట్ల విలువైన భూమి హాంఫట్‌కు మళ్లీ స్కెచ్
- టీడీపీ కార్యాలయం పేరిట తెరపైకి తెచ్చిన వైనం!
- ఆరేళ్ల క్రితమే ప్రయత్నించి వదిలేసిన టీడీపీ నేతలు
- అధికారంలోకి వచ్చాక.. మళ్లీ మత్స్యశాఖను చెరబట్టిన వైనం
- జేసీబీలతో స్థలం చదును
- కళ్లు మూసుకుని చోద్యం చూస్తున్న అధికార గణం
- మత్స్యకారుల సంఘాలకు పక్కా భవనం లేనట్లే..?

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ఆర్టీసీ బస్టాండు పక్కన.. రైల్వే గూడ్సుషెడ్డును ఆనుకుని మత్స్యశాఖకు చెందిన సర్వే నంబర్ 1/1బీ3 లో 1.20 ఎకరాల స్థలం ఉంది. చేప పిల్లల పెంపకానికి సంబంధించిన పది కుంటలతో పాటు మత్స్యశాఖ పరిపాలన భవనం కూడా ఇక్కడే ఉండేది. 2011లో కురిసిన భారీ వర్షాలకు మత్స్యశాఖ భవనం పూర్తిగా నేలమట్టమైంది. దీంతో తాత్కాలిక భవనాన్ని పాత కలెక్టరేట్‌కు మార్చారు. ఇంతటితో నగర నడిబొడ్డున మత్స్యశాఖ కార్యాలయ స్థలాన్ని అందరూ మరచిపోయారు. 2013లో జరిగిన సమైక్యాంధ్ర ఉద్యమ సమయంలో మత్స్యశాఖ భవనానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. కొన్ని రోజుల పాటు స్థలాన్ని చూసుకోవడానికి మత్స్యశాఖ అధికారులు ఇక్కడ కాపలాదారుడ్ని నియమించారు. తర్వాత కాలంలో అతడిని విధుల నుంచి తప్పించారు. 2014–19 మధ్యలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వ హయంలో ఈ స్థలాన్ని జిల్లా టీడీపీ కార్యాలయం కోసం కేటాయించాలని అప్పటి నేతలు పట్టుబట్టారు. టీడీపీ కార్యాలయం కోసం 33 ఏళ్ల పాటు ఈ స్థలాన్ని లీజుకు ఇవ్వాలని నాటి ప్రభుత్వానికి నేతలు లేఖ రాయడం, జీవో ఇవ్వడం చకచకా జరిగిపోయాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయంలో మత్స్యశాఖకు చెందిన స్థలంలో సహకార సంఘాలకు పక్కా భవనాలు, శిక్షణ కేంద్రం నిర్మించాలని నిర్ణయించింది.

రూ.40 కోట్లకు పైనే..!

చిత్తూరు ఆర్టీసీ బస్టాండు వద్ద చదరపు అడుగు స్థలం రూ.10 వేలకు పై చిలుకు పలుకుతోంది. ఈ లెక్కన 1.20 ఎకరాలున్న మత్స్యశాఖ స్థలం దాదాపు రూ.40 కోట్ల పైమాటే! జిల్లా కేంద్రంలో కేంద్రీయ విశ్వవిద్యాలయం, స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ, మ్యాంగో బోర్డు లాంటి వాటికి స్థలం లేదని చెబుతున్న అధికారులు.. నగర నడిబొడ్డున ఉన్న ఖరీదైన స్థలాన్ని టీడీపీ కార్యాలయానికి ఎలా ఇస్తారనే దానిపై పెదవి విప్పడం లేదు. వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నారు. 'మీ పని మీరు కానీయండి..మేం కళ్లు మూసుకుని చోద్యం చూస్తాం' అనే లెవెల్లో ఉంటున్నారనే విమర్శలొస్తున్నాయి. చిత్తూరు నగరంలోని సీఎంటీ రోడ్డులో జిల్లా టీడీపీ కార్యాలయం ఉన్నా.. విలువైన స్థలాన్ని పార్టీ కార్యాలయం పేరిట లీజు కంటూ ఎంట్రీ ఇచ్చి, ఆపై శాశ్వతంగా పాగా వేయడానికి కొందరు నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.



చిత్తూరులోని మత్స్యశాఖ కార్యాలయ స్థలం(ఫైల్)

మారిన సీన్..

జిల్లాలో 700లకు పైగా మత్స్యకార సంఘాలు ఉన్నాయి. వీటిపై 30 వేలకు పైగా కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. చెరువుల్లో చేపపిల్లలను వదలడానికి చిత్తూరులోని మత్స్యశాఖ కార్యాలయ కుంటల్లో విత్తన చేపలను పెంచి, జిల్లా మొత్తం సరఫరా చేసేవాళ్లు. చేపల చెరువుల వేలంలో వచ్చిన ఆదాయంలో కొంత మొత్తాన్ని మత్స్యకారుల సంక్షేమానికి వినియోగిస్తూ వచ్చారు. చేప పిల్లల పెంపక కుంటలు, మత్స్యకారులకు శిక్షణ ఇచ్చేందుకు సమావేశపు హాలు నిర్మించడానికి గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధుల (ఆర్‌డీఎఫ్) నుంచి రూ.1.50 కోట్లు విడుదల కూడా చేసింది. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకుల కళ్లు మళ్లీ చిత్తూరులోని మత్స్యశాఖ కార్యాలయ స్థలంపై పడింది. అధికారంలోకి వచ్చాక అడ్డేముంది? ఆపేదెవరు? అని తలచుకోవడం ఆలస్యం..చకచకా ఇక్కడి స్థలాన్ని చదును చేసేస్తున్నారు! పార్టీ జిల్లా కార్యాలయ భవనాన్ని నిర్మించడానికి వేగంగా పనులు చేస్తున్నారు. అసలు స్థలాన్ని టీడీపీ నేతలకు ఇచ్చినట్లు రెవెన్యూ అధికారుల నుంచి ఎలాంటి కేటాయింపు ఉత్తర్వులు లేవు. అయినాసరే అధికారాన్ని అడ్డుపెట్టుకుని జిల్లా అధికారులకు ఏమాత్రం సమాచారం కూడా ఇవ్వకుండా ఇలా వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

స్థలం ఎవరికీ ఇవ్వలేదు

"మత్స్యశాఖ కార్యాలయ స్థలం ప్రస్తుతం రెవెన్యూ ఆధీనంలో ఉంది. దీన్ని ఎవరికీ కేటాయించలేదు. గతంలో ఏం జరిగిందో తెలుసుకుంటాం. అంతలోపు స్థలాన్ని ఎవరైనా ఆక్రమించాలని చూస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– చిన్నయ్య, ఆర్డీవో, చిత్తూరు.

డీఎస్పీల పోస్టింగుల్లో

ఎమ్మెల్యేలకు షాక్..!

- సిఫార్సు లేఖలను చెత్తబుట్టలో పడేసిన కమిటీ
- ఆ మూడు అక్షరాలే ప్రామాణికంగా పోస్టింగులు!
- తిరుపతిలో చక్రం తిప్పుతున్న ఓ పోలీస్ అధికారి
- డీఎస్పీల కేటాయింపుపై పలువురు ఎమ్మెల్యేల కినుక
- జిల్లాలో ఖాళీగా ఉన్న చోటికి డీఎస్పీల నియామకం



చిత్తూరుకు సాయినాథ్ నాయుడు



పలమనేరుకు వస్తున్న ప్రభాకర్ నాయుడు

చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా కేంద్రంతో పాటు పలమనేరు లాంటి ప్రధాన సబ్–డివిజన్లకు డీఎస్పీగా ఎవరిని నియమించాలనే దానిపై సుదీర్ఘంగా కుస్తీ పడ్డ టీడీపీ నేతలు ఎట్టకేలకు ఓ నిర్ణయానికి వచ్చారు. తుదిగా టీడీపీ నేతల ప్రతిపాదన అధిష్టానానికి వెళ్లడంతో.. శంఖంలో పోస్తేనే తీర్థం అన్నట్టు.. పలువురు డీఎస్పీలను ఖాళీగా ఉన్న స్థానాలకు కేటాయిస్తూ బుధవారం రాష్ట్ర డీజీపీ ద్వారక తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరులో ఉన్న రాజగోపాల్‌రెడ్డిపై సామాజిక వర్గం ముద్రవేసి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపించి, ఇక్కడి స్థానాన్ని ఖాళీగా ఉంచిన విషయం తెలిసిందే. ఈ స్థానంలో కమ్మ సామాజిక వర్గానికి చెందిన టి.సాయినాథ్‌ను నియమించారు. ఈయన గతంలో చిత్తూరు స్పెషల్‌బ్రాంచ్, పుంగనూరులో సీఐగా, తిరుపతి జిల్లాలోనూ పనిచేశారు. ప్రస్తుతం నెల్లూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న టి.సాయినాథ్‌ను చిత్తూరుకు బదిలీ చేశారు. అయితే చిత్తూరు డీఎస్పీగా కమ్మ సామాజికవర్గానికి చెందిన డేగల ప్రభాకర్‌ను నియమించాలని స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు లేఖ కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేను కాదని సాయినాథ్ పేరును సిఫార్సు చేస్తూ తిరుపతిలో కూర్చుని చక్రం తిప్పుతున్న ఓ పోలీస్ అధికారి సూచనలతో బదిలీ జరిగినట్లు తెలుస్తోంది. పలమనేరు ఎమ్మెల్యే, నాటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన అమర్‌నాథ్‌రెడ్డికి ఇష్టం లేకున్నా రాజమండ్రి స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న డేగల ప్రభాకర్ నాయుడును పలమనేరుకు బదిలీ చేశారు. డీఎస్పీ బదిలీ వ్యవహారంలో అమర్‌నాథ్‌రెడ్డి పార్టీ పెద్దలపై, తిరుపతిలోని ఓ పోలీస్ అధికారిపై గుర్రుగా ఉన్నట్టు ప్రచారంలోకి వచ్చింది. నగరిలో పనిచేస్తున్న కె.నరసింహమూర్తిని శ్రీకాళహస్తికి బదిలీ చేశారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌కుమార్ రెడ్డి సైతం అసంతృప్తి ఉన్నట్లు తెలుస్తోంది. ఇక తిరుపతి ఎస్ఈబీలో ఉన్న వి.రమణకుమార్‌ను తిరుపతి సీసీఎస్‌కు, కదిరిలో ఉన్న ఎం.శ్రీలతను తిరుపతి మహిళా స్టేషన్‌కు, చిత్తూరు మహిళా స్టేషన్‌లో ఉన్న ఐ.సుధాకర్‌రెడ్డిని రెండో బెటాలియన్ ఎస్‌డీఆర్‌ఎఫ్‌కు (ప్రకృతి వైపరీత్యాల అత్యవసర ఫోర్స్) బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. మొత్తంగా ఎస్ఐల వరకు తమ మాట నెగ్గించుకున్న అధికార పార్టీ ఎమ్మెల్యేలకు సీఐలు బదిలీల్లో మొండిచేయి చూపించగా, డీఎస్పీలను మాత్రం చెప్పినవాళ్లనే వేస్తామని హామీ ఇచ్చిన అధిష్టానం రిక్త హస్తం చూపించింది. ఎమ్మెల్యేలు చెప్పిన పనులన్నింటికీ తల ఊపకుంటే తమను కాదని వచ్చిన డీఎస్పీల పరిస్థితి ఎలా ఉంటుందోననే చర్చ పోలీసుశాఖలో మొదలైంది.

క్లుప్తంగా

ట్రాన్స్‌కోలో ఖాళీలను భర్తీ చేయాలి



మాట్లాడుతున్న డిస్కం కార్యదర్శి దేవేంద్రరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కోలో ఖాళీలను భర్తీ చేయాలని విద్యుత్ ఉద్యోగుల సంఘం 1104 డిస్కం కార్యదర్శి దేవేంద్రరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆ శాఖ అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న జేఎల్ఎం, కార్యాలయ సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలన్నారు. జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులను ట్రాన్స్‌కోకు పూర్తిగా అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. 1993వ బ్యాచ్ ఉద్యోగులకు జీతాలను సమాంతరంగా ఇవ్వాలన్నారు. సమావేశంలో డిస్కం అధ్యక్షుడు గోపి, వర్కింగ్ అధ్యక్షుడు వేణుగోపాల్, నాయకులు గోవిందరాజులు, సురేష్, చిట్టిబాబు నాయుడు, పద్మనాభనాయుడు, అరుణ్, సత్య తదితరులు పాల్గొన్నారు.

మైనర్ బాలికపై లైంగిక దాడికి యత్నం

చిత్తూరు అర్బన్: చిత్తూరులో ఓ మైనర్ బాలికపై లైంగిక దాడికి యత్నించిన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. టూటౌన్ సీఐ నెట్టికంఠయ్య కథనం.. తేనబండ పక్కనున్న బోడిగుట్టకు చెందిన నవీన్ అనే వ్యక్తి ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఆమె కుమార్తె(14)తో కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నాడు. తాను పనికి వెళ్లి వచ్చేసరికి, బాలిక ఏడుస్తోందని.. అడిగితే తనపై నవీన్ లైంగిక దాడికి ప్రయత్నించాడని బాలిక చెప్పిందని ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలికను వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించి, పిల్లలపై లైంగిక దాడుల నిరోధక చట్టం (పోక్సో) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పీఎంకేవీవై కోర్సుల్లో ఉచిత శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో పీఎంకేవీవై (ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన) కోర్సుల్లో మూడు నెలల కాల వ్యవధితో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రిన్సిపల్ రవీంద్రరెడ్డి తెలిపారు. పదవ తరగతి పాస్, ఫెయిల్, ఎలాంటి వయోపరిమితి లేదన్నారు. గ్రామాల నుంచి ఐటీఐ రావడానికి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా బస్సు పాసు ఇస్తామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఎలక్ట్రిక్, సోలార్, కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామని, ఇతర వివరాలకు 9160940479, 7799679351 సెల్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.



మద్యం పాలసీతో కూటమికి కిక్కు!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పటివరకూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఉద్యోగాలు ఊడినట్టేనని పిస్తోంది. ప్రభుత్వం నూతన మద్యం పాలసీని సెప్టంబర్ నుంచి అమలు చేస్తామని ప్రకటించడం, ఇదే విషయాన్ని ఆ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తాజాగా మంగళవారం కూడా మెరుగైన మద్యం పాలసీని రూపొందిస్తున్నామని, ధరలు కూడా తగ్గిస్తున్నామని ప్రకటించడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ప్రతినెలా 4న అందే జీతాలు ఇప్పటివరకూ అందకపోవడం చూస్తుంటే తమ బతుకులు రోడ్డున పడేసే పరిస్థితులు తప్పవని సంకేతాలిచ్చినట్లవుతోందని వాపోతున్నారు.

- అక్టోబర్ 1 నుంచి నూతన పాలసీ
- మద్యం షాపుల ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరం
- వేతనాలు అందక అవస్థలు
- దుకాణాల కోసం కూటమి నేతల ప్రయత్నాలు

పలమనేరు: చిత్తూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో వందకుపైగా ప్రభుత్వ మద్యం దుకాణాలున్నాయి. వీటిలో టౌన్‌లోని దుకాణాల్లో ప్రతి దుకాణానికి ఓ సూపర్ వైజర్, ముగ్గురు సేల్స్‌మెన్లు, ఒక వాచ్‌మన్, అదే మండలాల్లో అయితే ఓ సూపర్‌వైజర్, ఇద్దరు సేల్స్‌మెన్లు, ఒక వాచ్‌మన్ ఉన్నారు. ఆ లెక్కన సెబ్ పరిధిలోని వంద దుకాణాల్లో మొత్తం 480 మంది దాకా ఉద్యోగులున్నట్లే. వీరిలో సూపర్‌వైజర్‌కు నెలకు రూ.19వేలు, సేల్స్‌మెన్లకు రూ.16,500, వాచ్‌మన్లకు రూ.12వేలు జీతం ఇస్తున్నారు. ప్రతినెలా నాలుగోతేదీలోపు అందే జీతాలు ఈనెల 17వ తేదీ నాటికి కూడా క్రెడిట్ కాలేదు.

అప్పట్లో టీడీపీ పాలనలో..

2019కి ముందు ఉన్న మద్యం దుకాణాలకు ప్రతి రెండేళ్లకోసారి టెండర్లు పిలిచేవారు. లాటరీ ద్వారా దుకాణాలు కేటాయించేవారు. మహిళలు సైతం టెండర్లలో పాల్గొనేవారు. కొన్ని ముఖ్యమైన మద్యం దుకాణాలకు డిమాండ్ ఉండేది. అవన్నీనూ రాజకీయ నాయకుల అజమాయిషీలోనే నడిచేవి. ప్రైవేట్ దోపిడీని అరికట్టేందుకు 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రభుత్వ దుకాణాలకు శ్రీకారం చుట్టింది. అవినీతి అక్రమాలకు చెక్ పెట్టింది.

గత ప్రభుత్వ పాలనలో ఉపాధి

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రభుత్వ మద్యం షాపులతో పలువురు నిరుద్యోగులకు ఉపాధితో జీవితాన్నిచ్చింది. దాదాపు ఐదేళ్లపాటు ఎలాంటి కష్టం లేకుండా వారు ప్రభుత్వ దుకాణాల్లో పనిచేశారు. కుటుంబాలను పోషించేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీతో వీరి ఉద్యోగాలు ప్రశ్నార్థకమయ్యాయి.

మరి ఇప్పుడు కూటమి పాలనలో..

కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ కారణంగా ప్రైవేట్ ఏజెన్సీలు మద్యం షాపులను నిర్వహించే పరిస్థితి కనిపిస్తోంది. దీనికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ సైతం కొనసాగుతోంది. మద్యం పాలసీతో అంతిమంగా లబ్ధి పొందేది కాంట్రాక్టర్లు, టీడీపీ నేతలేనని చర్చకు తావిచ్చింది. ఇక ప్రభుత్వ మద్యం షాపుల సిబ్బందిని కొనసాగిస్తారా లేక తొలగిస్తారా? అనే విషయంపై స్పష్టత లేకపోవడం.. ఒకవేళ తమను విధుల నుంచి తొలగిస్తే తాము ఆందోళన బాట పట్టక తప్పదని చెబుతున్నారు. ఇదే విషయాన్ని జిల్లా సెబ్ అధికారులను ప్రశ్నిస్తే.. అదంతా ప్రభుత్వ పాలసీ..తమకెలాంటి సంబంధం లేదంటున్నారు.

పోలీసుల అదుపులో లక్కనపల్లి శ్రీనివాసులు రెడ్డి!

- టీడీపీ నేత రోడ్డు ప్రమాదంపై అనుమానంతో అదుపులోకి
- ఆయనతోపాటు మరో ఇద్దరు డ్రైవర్లు సైతం..



లక్కనపల్లి శ్రీనివాసులు రెడ్డి

పలమనేరు: టీడీపీ నాయకునిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదాన్ని హత్యాయత్నం కేసుగా నమోదు చేసిన గంగవరం పోలీసులు బైరెడ్డిపల్లె మండలం లక్కనపల్లెకు చెందిన మాజీ జెడ్పీటీసీ, ఎంపీపీ, జాతీయ అవార్డు గ్రహీత శ్రీనివాసులు రెడ్డితోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని రహస్య విచారణ చేస్తున్నట్టు సమాచారం. వివరాలిలా... బైరెడ్డిపల్లె మండలం లక్కనపల్లెకు చెందిన స్థానిక ఎమ్మెల్యే అనుచరుడు, ఆ గ్రామానికి చెందిన రఘుచంద్ర గుప్త మంగళవారం తమిళనాడులోని అరుణాచలంలో గిరిప్రదర్శన చేసి స్వగ్రామానికి వస్తుండగా గంగవరం మండలంలోని నాలుగురోడ్ల వద్ద టెంపో ఆయన కారును ఢీకొనడం విదితమే. దీనిపై ఆయన తనపై హత్నాయత్నం జరిగిందని గంగవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసిన పోలీసులు కర్ణాటక రాష్ట్రం ముళబాగిల్‌కు చెందిన ఇద్దరు లారీ డ్రైవర్లను అదుపులోకి తీసుకుని వారిచ్చిన సమాచారమంటూ శ్రీనివాసులు రెడ్డిని సైతం అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్టు తెలిసింది. గతంలో ఆయన టీడీపీలో సీనియర్ నేతగా ఉండేవారు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కోసం నియోజకవర్గంలో పనిచేశారు. దీనిపై కక్ష గట్టిన కూటమి నాయకుల ఆదేశాలతోనే ఈ కేసులో ఆయన్ను ఇరికించినట్టు విమర్శలొస్తున్నాయి. ఇక, ప్రమాదానికి గురైన రఘుచంద్ర గుప్త పలు వ్యాపారాలను చేస్తున్నాడు. ఆయనపై వ్యాపార లావాదేవీల విషయంగా దాడి జరిగిందా? అనే కోణాన్ని విస్మరించిన పోలీసులు శ్రీనివాసులు రెడ్డిని అరెస్ట్ చేయడం నియోజకవర్గంలో సంచలనం రేపింది. ఈ విషయమై గంగవరం అర్బన్, రూరల్ సీఐలు ప్రసాద్, మురళీమోహన్ సైతం స్పందించకపోవడం కొసమెరుపు.

సర్దుబాట్లు మాకొద్దు సారూ..!

- ఉత్తర్వులు రద్దు చేయాలని యూటీఎఫ్ డిమాండ్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో నిర్వహిస్తున్న బలవంతపు సర్దుబాట్లు తమకొద్దని టీచర్లు తేల్చి చెబుతున్నారని, దీనికి సంబంధించిన ఉత్తర్వులు రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన అసోసియేషన్ నాయకులతో కలిసి డీఈఓ దేవరాజుకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. జిల్లాలో ఒక్కొక్క మండలంలో ఒక్కో విధంగా సర్దుబాటు ప్రక్రియ నిర్వహిస్తున్నారని, దీనిలో పారదర్శకత లేదని విమర్శించారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో టీచర్ల సమావేశంలో చర్చించిన మినిట్స్, రాష్ట్ర శాఖ విడుదల చేసిన ఉత్తర్వులకు విరుద్ధంగా ప్రక్రియ సాగుతోందని ఆరోపించారు. మండలాల్లో ఉన్న ఎస్జీటీలను బలవంతంగా హైస్కూళ్లకు పంపిస్తున్నారని, అర్హత లేకపోయినా ఎలా పంపుతారని ప్రశ్నించారు. తమిళం, ఉర్దూ ఉన్నత పాఠశాలల్లో అవసరం ఉన్నప్పటికీ తెలుగు స్కూల్ అసిస్టెంట్లను మిగులుగా చూపిస్తున్నారని, ఉర్దూ పోస్టులను కేటాయించడం అసంబద్ధమైన ప్రక్రియ అని ఆక్షేపించారు. మండల స్థాయిలో విద్యార్థుల సంఖ్య పెరుగుదలకు అనుగుణంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సుధాకర్‌రెడ్డి, రెహానాబేగం, కృష్ణమూర్తి, రెడ్డెప్పనాయుడు, ఎస్పీ బాషా, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేకం



పూజల్లో పాల్గొన్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: మండలంలోని చవనపల్లెలో నూతన శ్రీ వినాయకస్వామి ఆలయంలో బుధవారం కుంభాభిషేక మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కలశ పూజలు, హోమాలు, గణపతి, గోపూజ మొదలైన వాటిని శాస్త్రోక్తంగా వేద పండితులు నిర్వహించారు. సాయంత్రం కుంభాభిషేక మహోత్సవానికి మాజీ ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి హాజరయ్యారు. అర్చకులు, గ్రామస్తులు ఆయనను సాదర స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామయ్య, హేమసుందర్‌రెడ్డి, శివాజీ, నారాయణరెడ్డి, పరంధామరెడ్డి, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో మెగాస్టార్

తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనార్థం ప్రముఖ సినీ నటుడు, కేంద్ర మాజీమంత్రి మెగాస్టార్ చిరంజీవి బుధవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. ఆయనకు అతిథి గృహం వద్ద టీటీడీ రిసెప్షన్ డిప్యూటీ ఈఓ భాస్కర్ మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. గురువారం శ్రీవారిని చిరంజీవి దర్శించుకోనున్నారు.

యంత్రాలతో కూటమికి 'ఉపాధి'

- కూలీల కడుపు కొడుతున్నారని వైఎస్సార్‌సీపీ నిరసన
- యంత్రాలతో పనులు చేసి బిల్లులు స్వాహా
- ఫీల్డ్ అసిస్టెంట్లు, సంఘమిత్రల తొలగింపు శోచనీయం



ఎంపీడీఓ రాజేంద్రబాలాజీకి వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

బైరెడ్డిపల్లె: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై సైతం కక్ష సాధింపులకు దిగుతూ ఫీల్డ్ అసిస్టెంట్లను, సంఘమిత్రలను తొలగిస్తోందని వైఎస్సార్‌సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పథకం పనులకు రూ.6కోట్ల నిధులు మంజూరయ్యాయని, కూటమి నేతలు యంత్రాలతో పనులు చేస్తూ కూలీల కడుపు కొడుతున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం వలసల నివారణ కోసం ప్రవేశపెట్టిన పథకం కూటమి నేతల జేబులు నింపుకోవడానికి ×ఉపాధి¤ ఉపయోగపడుతోందన్నారు. ధర్మపురి, నాగిరెడ్డిపల్లె, చీలంపల్లె, కడపనత్తం గ్రామాల్లో యంత్రాలతో పనులు చేసి బిల్లులు స్వాహా చేశారని ఆరోపించారు. కూటమి నేతల దౌర్జన్యాలను అరికట్టి కూలీలకు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండలంలో 11 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులంటూ తొలగించిందని, వీరిలో ఏడుగురు దళితులేనని, అలాగే తొలగించిన ఐదుగురు సంఘమిత్రల్లో ముగ్గురు దళితులు ఉన్నారన్నారు. దళితులకు తీవ్ర అన్యాయం చేస్తే కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. అనంతరం ఎంపీడీఓ రాజేంద్ర బాలాజీకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నారాయణస్వామి, రూపజయకుమార్‌రెడ్డి, సర్పంచులు రమణారెడ్డి, వెంకటేష్, రాజప్ప, వైస్ సర్పంచ్ తబ్రాజ్, ఎంపీటీసీ నాగరాజు, మండల వైఎస్సార్‌సీపీ యూత్ ప్రెసిడెంట్ మహేష్, మండల కన్వీనర్ కార్తిక్, వైఎస్సార్‌సీపీ నేతలు తీర్థం కేశవులు, శంకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చలపతి, శివన్న, శంకర్, రాజప్ప, ఆనంద, మురళి పాల్గొన్నారు.

పక్కాగా రైతుల వివరాల నమోదు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఈ-క్రాప్ నమోదుకు రైతుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, అనుబంధ శాఖలు, గృహనిర్మాణ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షలు నిర్వహించారు. జిల్లాకు 2024-25 సంవత్సరానికిగాను 21 వేల హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం చేయాలని లక్ష్యంగా నిర్దేశించామని, ఇప్పటి వరకు 10 వేల హెక్టార్లకు మాత్రమే 9,169 మంది రైతులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖలకు చెందిన నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు సమష్టిగా ఈ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1,11,727 ఎకరాలలో అన్ని పంటలకు చెందిన ఈ-క్రాప్ నమోదు పూర్తి చేశారన్నారు. అలాగే, జిల్లాలో పెండింగ్ ఇళ్ల నిర్మాణాలను పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. ఇసుక, ఏ ఇతర సమస్యలున్నట్‌లైతే తమ దృష్టికి తేవాలన్నారు. సమీక్షల్లో ట్రైనీ కలెక్టర్ హిమ వంశీ, వ్యవసాయ, ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్ రెడ్డి, శోభారాణి, ఏపీఎంఐపీ పీడీ బాల సుబ్రమణ్యం, హౌసింగ్ పీడీ పద్మనాభం, ఎంపీడీఓలు, గృహనిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

శిలాఫలకంపై సమ్మెట పోటు!

- కొనసాగుతున్న టీడీపీ విధ్వంసాలు



శిలాఫలకాన్ని ధ్వంసం చేస్తున్న టీడీపీ నేతలు

నగరి : టీడీపీ నేతల విధ్వంసాలు కొనసాగుతూనే ఉన్నాయి. నగరిలో నేత్ర ప్రదాయణి దేశమ్మ దేవత ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా వేసిన శిలాఫలకంపై ఆ పార్టీ నేతలు అక్కసు ప్రదర్శించారు. భక్తులు, స్థానికులు చూస్తుండగానే నేత్రప్రదాయణి సాక్షిగా శిలాఫలకాన్ని సమ్మెటతో పలగగొట్టారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు ఆలయ కమిటీకి గతంలో ఉన్న కార్యవర్గ సభ్యులు చెప్పారు.

24, 25 తేదీల్లో క్రికెట్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-14 విభాగం క్రికెట్ పోటీలకు క్రీడాకారులను 24, 25 తేదీల్లో ఎంపిక చేయనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడు జోన్లలో ఈ నెల 24, 25 తేదీల్లో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మొట్టమొదటసారిగా కార్పొరేషన్, నగరం, మండలం, గ్రామాల్లో క్రీడాకారులు క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారు. 2010 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారు క్రీడాకారులు, సొంత కిట్, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం తీసుకుని రావాలని సూచించారు. 24న పుత్తూరులోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీకాళహస్తిలో కేసీసీ క్రికెట్ నెట్స్, పీలేరులో పీవీసీ క్రికెట్ అకాడమీ, వాల్మీకిపురంలో జీవీఎస్‌సీఎస్ క్రికెట్ గ్రౌండ్స్‌లో పోటీలు జరుగుతాయని వివరించారు. 25న తిరుపతిలో సీవీ క్రికెట్ అకాడమీ, చిత్తూరులో చిత్తూరు పోలీస్ గ్రౌండ్, పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వి.కోటలో జీఎంఆర్ క్రికెట్ అకాడమీలో పోటీలు ఉంటాయని, వివరాలకు 9000214966, 8886185559లో సంప్రదించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ నేత వాటర్ ప్లాంట్‌కు కరెంట్ కట్!

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని విష్ణుప్రియ హోటల్ వెనుక వైఎస్సార్ సీపీ నాయకుడు చెందిన మణి కొంతకాలంగా మినరల్ వాటర్‌ప్లాంట్ నిర్వహిస్తున్నారు. ఈయన గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కోసం పనిచేశాడని కక్ష కట్టిన కూటమి నేతలు ఆయన వాటర్ ప్లాంట్‌కు విద్యుత్ సరఫరాను కట్ చేస్తున్నట్టు బుధవారం మున్సిపల్ అధికారులతో నోటీసులు జారీ చేయించారు. మున్సిపల్ అధికారులు సైతం ఈ వాటర్‌ప్లాంట్ నిర్వహణకు బ్రేక్ వేసినట్లు తెలిసింది. నిబంధనలు పాటించకుండా పట్టణంలో ఇరవై వరకూ వాటర్‌ప్లాంట్లు యథేచ్ఛగా అక్రమ నీటి వ్యాపారం చేస్తున్నా వారిని కాదని కేవలం వైఎస్సార్‌సీపీ నేత వాటర్‌ప్లాంట్‌పై కత్తి కట్టడం చర్చనీయాంశమైంది. దీనిపై స్థానిక ట్రాన్స్‌కో ఏడీ చిన్నబ్బను వివరణ కోరగా.. తమకు మున్సిపల్ కార్యాలయం నుంచి లేఖ వచ్చిందని చెప్పారు. ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డిని వివరణ కోరగా.. మణి వాటర్ ప్లాంట్ బోరుకు సమీపంలో బోరు ఉంచడంతో చర్యలు తీసుకోవాలని సూచించామని తెలిపారు.

ఆటో సహా శ్రీగంధం పట్టివేత

భాకరాపేట : ఆటో సహా శ్రీగంధం స్వాధీనం చేసుకుని 9 మంది స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎర్రావారిపాళెం ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు ఆయన వివరాలు వెల్లడించారు. ఎర్రావారిపాళెం సమీపంలో 66 కేజీలు బరువు ఉన్న శ్రీగంధం చెక్కలను ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నామని, 9 మంది స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

అత్యాధునిక పరికరాలతో విద్యుత్ ఆదా



మాట్లాడుతున్న డీఈఈ శివరామ్‌కుమార్

చిత్తూరు కార్పొరేషన్: ఎంఎస్ఎంఈ పరిశ్రమల్లో అత్యాధునిక పరికరాలతో విద్యుత్ ఆదా చేయవచ్చని ఏపీఎస్ఈసీఎం డీఈఈ శివరామ్‌కుమార్ అన్నారు. బుధవారం మ్యాంగోభవన్‌లో సంబంధిత పరిశ్రమదారులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఇంధన సామర్థ్యం, వినియోగం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన మెలకువలను తెలియజేశారు. 5 స్టార్ రేటింగ్ ఉన్న విద్యుత్ పరికరాలు, నాణ్యమైన వైరింగ్ వల్ల ఎక్కువ కాలం మన్నికనిస్తాయన్నారు. ఇవి కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గిస్తాయని నిరూపితమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిత్తూరు ఫుడ్ ప్రాసెసింగ్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బాబీ, చీఫ్ కన్సల్టెంట్లు శ్రీనివాసరావు, సుదీప్, ఏపీఐటీకో కన్సల్టెంట్ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అధ్యయనం



ప్రకృతి వ్యవసాయ సూత్రాలను తమిళనాడు బృందానికి విశదీకరిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్

- నగరి మండలంలో పర్యటించిన తమిళనాడు శాస్త్రవేత్తల బృందం

నగరి : మన రాష్ట్రంలో రైతాంగం అవలంభిస్తున్న సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అధ్యయనం చేయడానికి తమిళనాడు నుంచి ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ శాస్త్రవేత్త బృందం బుధవారం నగరి నియోజకవర్గంలో పర్యటించింది. కృష్ణారామపురంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ చంద్రశేఖర్ సాగు చేస్తున్న నవధాన్యాల పంటను పరిశీలించింది. సేంద్రియ ఎరువులు వాడే పొలంలోని మట్టి సారాన్ని, భూమిలోని వానపాముల శాతాన్ని శాస్త్రవేత్తలు గమనించారు. అనంతరం వేరుశనగలో ఏటీఎం మోడల్ సాగును, అంతరపంటలు, ఎరపంటలు, రక్షక పంటల సాగును, పొలాల్లోని జీవామృత తొట్టెలను పరిశీలించారు. లత అనే రైతు సజ్జ పంటలో అంతర పంటగా సాగుచేసిన ఆరు రకాల పంటలను పరిశీలించారు. అనంతరం కృష్ణారామాపురం పాఠశాల వద్ద రైతులతో సమావేశమయ్యారు. సేంద్రియ వ్యవసాయంలో కలిగే లాభాలను తెలుసుకున్నారు. సేంద్రియ సాగుకు సంబంధించి తొమ్మిది సార్వత్రిక సూత్రాల మోడల్ చక్రం, సూత్రాల గురించి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు వారికి విశదీకరించారు. ఆ తర్వాత విజయపురం మండలం జగన్నాథపురంలో ఫార్మా సైంటిస్ట్ రుక్మిణి పొలంలోని జామ తోటలను పరిశీలించారు. చెరకు ఆకులను కాల్చకుండా ఉపయోగించుకుంటున్న విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్‌పీఎం షాపులో నవధాన్యాల విత్తనాలు, తోటల విత్తనాలు, ఎస్‌టుఎస్ కిట్స్, వేపగింజల తయారీ, కషాయాల విక్రయాన్ని పరిశీలించారు. తమ ప్రాంతాల్లోనూ రైతులు ఈ పద్ధతులతో వ్యవసాయం చేసేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ బయోటెక్నాలజీ డాక్టర్ వీఆర్ ప్రభావతి, డైరెక్టర్ బయో డైవర్సిటీ డాక్టర్ ఈడీ ఇజ్రాయిల్ ఓలివర్‌కింగ్, శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.జగన్, పీపీటీ పుష్ప, ఎస్ఎస్ఏ నాంచారమ్మ, ఎస్ఎస్ఏ గురుప్రసాద్, మోడల్ మేకర్ సురేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, యూనిట్ ఇన్‌చార్జిలు, రైతులు పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి ఆందోళన

గూడూరురూరల్: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి ప్లేటు ఫిరాయించిన యువకుడి ఇంటి వద్ద బుధవారం ఓ యువతి నిరసనకు దిగినంది. గూడూరు పట్టణం అరుంధతీయవాడకు చెందిన ఓ యువతిని అదే ప్రాంతానికి చెందిన యువకుడు ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. ఇప్పుడు అతను మరో వివాహానికి సిద్ధం కావడంతో ఆమె అతని ఇంటి వద్ద బైఠాయించింది. ఇది కాస్తా పోలీసులకు చేరింది.